క్లుప్తంగా

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి



గండ్రేడులో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వెంకట రమణ తదితరులు

పెదపూడి: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తినిచ్చిన వీరనారి చాకలి ఐలమ్మ అని రజక చైతన్య సంఘం నియోజకవర్గ చైర్మన్ మురమళ్ల వెంకట రమణ అన్నారు. మండలంలోని గండ్రేడు గ్రామంలో శుక్రవారం చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. ముందుగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, పెన్సిళ్లు, స్వీట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ అల్లం వీడీ మెంటారావు, సర్పంచ్ కుడిపూడి మాధవీలత, ఉప సర్పంచ్ కర్రి శ్రీనివాస్, గ్రామ పెద్దలు, రజక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



భక్తులకు అన్నం వడ్డిస్తున్న పెద్దిరెడ్డి, మంగయ్యమ్మ దంపతులు

బిక్కవోలు: కొమరిపాలెంలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం అన్న సమారాధన నిర్వహించారు. గ్రామానికి చెందిన సూర్య మోడరన్ రైస్ మిల్లు అధినేత మల్లిడి పెద్దిరెడ్డి, మంగయ్యమ్మ దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. స్థానికులతో పాటు పందలపాక, తొస్సిపూడి, కొప్పవరం, రాయవరం పరిసరాల గ్రామాల నుంచి సుమారు ఐదువేల మంది భక్తులు తరలివచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో కేపీఆర్ సంస్థల అధినేత కొవ్వూరి పాపరెడ్డి, ఉప సర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు జామి విశ్వేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే ఊలపల్లిలోని జి.మామిడాడ రోడ్డు గల కనకదుర్గమ్మ ఆలయం వద్ద కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిపారు.

ఆధార్ మార్పులకు పాట్లు



ముగ్గళ్ల సచివాలయంలో ఆధార్ కేంద్రానికి వచ్చిన ప్రజలు

సీతానగరం: ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ, వాటిని గ్రామాల్లో ఒకటి, రెండు రోజులకు మించి నిర్వహించడం లేదు. మండలంలోని బొబ్బిల్లంకలో రెండు రోజులు, మిర్తిపాడులో ఒక రోజు నిర్వహించగా, శుక్రవారం ముగ్గళ్ల సచివాలయంలో జరిగింది. ఆధార్ కార్డులో మార్పులకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివెళ్లడంతో విపరీతమైన రద్దీ ఏర్పడింది. అలాగే కేంద్రం వద్ద కనీస వసతులు కల్పించలేదు. తాగునీటితో పాటు వృద్ధులు కూర్చునేందుకు ఏర్పాట్లు చేయలేదు. కాగా.. శనివారం కూడా ఆధార్ కేంద్రాన్ని కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

నేడు పూర్వ విద్యార్థుల సమావేశం

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుగుతుందని పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనల సత్తిరాజు అన్నారు. ఈ పాఠశాలలో 1992 – 97లో చదువుకున్న విద్యార్థులు సమావేశం కానున్నారన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజానగరం: మండలంలోని కానవరం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా అయ్యే 11 కేవీ ఎఫ్ఆర్ పేట ఫీడర్‌పై శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా ఉండదు. ఈ విషయాన్ని ఏపీఈపీడీసీఎల్ ఇన్‌చార్జి ఈఈ నటరాజన్ తెలిపారు. వార్షిక మరమ్మతుల నేపథ్యంలో ఈ అంతరాయం కలుగుతుందన్నారు.

కొత్త రుణాలు అందించేందుకు ప్రణాళిక

కోరుకొండ: రైతులకు రూ.10 కోట్ల కొత్త రుణాలు అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్టు కోరుకొండ పీఏసీఎస్ చైర్ పర్సన్ బత్తుల గోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం కోరుకొండ సొసైటీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన గోపాలకృష్ణ మాట్లాడుతూ 2,800 మంది సభ్యులున్న సొసైటీలో వచ్చే రబీ సీజన్‌కు విత్తనాలు, ఎరువులను సంతృప్తిగా అందజేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. సీఈఓ ఆకుల వెంకట రమణ మాట్లాడుతూ సొసైటీ పరిధిలోని పది గ్రామాల్లో 1,500 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగవుతోందన్నారు. సమావేశంలో మాజీ సీఈవో సుధాకర్ వర్మ, ఉద్యోగులు, వీరయ్య దొర, రైతులు పాల్గొన్నారు.

దొంగలకు ఝలాక్

- ఎల్‌హెచ్ఎంఎస్‌తో ప్రయోజనం
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు



ఊలపల్లిలో జరిగిన చోరీని పరిశీలిస్తున్న ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ (ఫైల్)

బిక్కవోలు: దసరా సందర్భంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. దీంతో పిల్లలతో కలిసి ఊర్లు వెళ్లడానికి చాలామంది సిద్ధమవుతారు. అమ్మమ్మ, నానమ్మల ఇంటికి, బంధువుల వద్దకు వెళ్లడానికి కుటుంబ సభ్యులందరూ ప్రణాళిక వేసుకుంటారు. అయితే ప్రస్తుతం దొంగల భయం చాలా ఎక్కువైంది. ఇంటికి తాళం వేసి ఉంటే చాలు దోచేస్తున్నారు. పగలంతా రెక్కీ నిర్వహించి, ఎవ్వరూ లేని ఇళ్లను గుర్తిస్తున్నారు. రాత్రి సమయంలో వచ్చి తాళం పగులకొట్టి దోచుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో ఊర్లు వెళ్లేవారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్ఎంఎస్)ను వినియోగించుకోవాలి.

ఎల్‌హెచ్ఎంఎస్ అంటే..

లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టంనే ఎల్‌హెచ్ఎంఎస్ అని పిలుస్తారు. ఇంటికి తాళం వేసి పొరుగు ఊర్లకు వెళ్లే వారికి చాలా బాగా ఉపయోగపడుతుంది. కానీ దీనిపై ప్రజలకు అవగాహన లేకపోవడంతో పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం లేదు. దీని వల్ల దొంగతనాలను సులభంగా నివారించవచ్చు. ఈ విధానంలో ముందుగా స్మార్ట్‌ఫోన్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నవారి వివరాలు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు చేరతాయి. ప్రయాణానికి ముందురోజు ఆరు అంకెల కోడ్‌తో పోలీసు రిక్వెస్ట్ ఆప్షన్‌లో నమోదు చేసుకోవచ్చు. వెంటనే పోలీసులు ఆ ఇంటికి వెళ్లి ఎల్‌హెచ్ఎంఎస్ పరికరాలను అమర్చుతారు. దీంతో ఆ ఇల్లు పోలీసుల కంట్రోల్‌లోకి వెళుతుంది. ఇంట్లో ఎవరూ లేని సమయాల్లో దొంగలు ప్రవేశిస్తే, నేరుగా పోలీసు కంట్రోల్ రూమ్‌లో అలారం మోగుతుంది. దీంతో స్థానిక పోలీసులు అప్రమత్తమై ఆ ఇంటికి చేరుకుని దొంగలను పట్టుకునే వీలుంటుంది.

జాగ్రత్తలు అవసరం

ఇంటికి తాళం వేసి ఊర్లు వెళ్లేవారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి. ఇంట్లోని విలువైన పత్రాలు, ఆభరణాలను బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి. రాత్రి పూట వీధుల్లో గస్తీ కాసే పోలీసులకు ప్రజలు కూడా సహకరించాలి. ఎక్కడైనా ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వారికి తెలియజేయాలి. ఇంటికి తాళాలు సక్రమంగా వేయడంతో పాటు ఇరుగుపొరుగు వారికి ఫోన్ చేసి ఇంటి పరిస్థితి తెలుసుకుంటూ ఉండాలి.



దొంగలు చిందరవందరగా పడేసిన సామగ్రి (ఫైల్)

ఉచితంగా సేవలు



దసరా సెలవులలో సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు ఎల్‌హెచ్ఎంఎస్ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. వారి ఇంటికి సీసీ కెమెరాలు అమర్చడంతో పాటు పర్యవేక్షణ చేస్తాం. ఈ సేవలు ఉచితంగా పొందవచ్చు. టూర్లకు వెళ్లే వారు విలువైన ఆభరణాలను ఇంటిలో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి.

– వాసంశెట్టి రవిచంద్ర కుమార్, ఎస్సై, బిక్కవోలు

చిరంజీవిపై వ్యాఖ్యలు అనైతికం



పెదపాటి రమేష్ బాబు

సీతానగరం: రాష్ట్ర అసెంబ్లీలో చిరంజీవిపై ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు అనైతికమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర వలంటీర్ వింగ్ జాయింట్ సెక్రటరీ పెదపాటి రమేష్ బాబు (డాక్టర్ బాబు) ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ చిరంజీవిపై చేసిన వ్యాఖ్యలను జనసేన ఎమ్మెల్యేలు ఖండించకపోవడం దారుణమన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నుంచి కూడా స్పందన లేకపోవడం దారుణమన్నారు. అలాగే మాజీ సీఎం జగన్‌పై బాలకృష్ణ ఇష్టానుసారం మాట్లాడారన్నారు. రాష్ట్రంలో కోట్లాది మంది ప్రజలకు మంచి చేసిన వ్యక్తి జగన్ అన్నారు. బాలకృష్ణ వ్యాఖ్యలతో ఎన్టీఆర్ కుటుంబంపై ఉన్న గౌరవం పోయిందన్నారు. కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టిన దమ్మున్న నాయకుడు జగన్ అన్నారు. బెజవాడ సాక్షిగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ తల్లిని తిట్టి, మళ్లీ పొడిగిన వ్యక్తి బాలకృష్ణ అన్నారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అసెంబ్లీలో అసత్యాలు మాట్లాడటం హేయమైన చర్య అన్నారు.

దోమల నివారణకు మందు పిచికారీ

రంగంపేట: మండలంలోని సుభద్రంపేట గ్రామంలో సర్పంచ్ కూటి సాయి తాతారావు ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున మురుగు కాలువల్లోని పూడిక తొలగించామన్నారు. అలాగే దోమల నివారణకు మందు పిచికారీ చేయించామన్నారు. గ్రామంలోని ప్రజలందరూ తమ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

మహిళా ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే బెదిరింపులు

- కూటమి పాలనలో అన్నీ అవమానాలే
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి ఆగ్రహం



అనపర్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ నియోజకవర్గంలోని మహిళా ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నుంచి బెదిరింపులు, అవమానాలు ఎక్కువయ్యాయని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం అనపర్తిలో విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు 15న జెండా వందనం చేయనీయకుండా పొలమూరు గ్రామ బీసీ మహిళా సర్పంచ్‌కు ఘోర అవమానం చేశారన్నారు. సచివాలయం-1 వద్ద జరగాల్సిన జెండా వందనాన్ని ఉద్దేశపూర్వకంగా సచివాలయం-2కి మార్చి, సర్పంచ్‌ను ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానించకుండా అవమానించారన్నారు. ఆ రోజు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పాల్గొన్న అన్ని కార్యక్రమాల ఫోటోలు, వీడియోలు విడుదల చేశారు కానీ, పొలమూరు కార్యక్రమాన్ని మాత్రం విడుదల చేయకుండా జాగ్రత్త పడి, వారి తప్పును కప్పిపుచ్చుకున్నారన్నారు. 2019కి ముందు టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రంగంపేట మండలం వెంకటాపురం గ్రామ బీసీ మహిళా సర్పంచ్ పేరును ఆర్చిలో వేయకుండా అవమానించారన్నారు. అలాగే అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామ బీసీ మహిళా సర్పంచ్ విషయంలోనూ అదే అవమానం చేశారన్నారు. వాటికి సంబంధించిన వీడియోలు, పేపర్ క్లిప్పింగులు ప్రదర్శించారు.

'సత్యసాయి' నీరందించండి

కోరుకొండ: సత్యసాయి తాగునీటి పథకం ద్వారా గోదావరి జలాలను ప్రజలకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, విద్యా కమిటీ మాజీ చైర్మన్ అడపా వీరబాబు కోరారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. రక్షిత నీరు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. కోటి, రాఘవపురం, శ్రీరంగపట్నం, కోటికేశవరం, బొల్లెద్దుపాలెం గ్రామాల ప్రజలు ఏజెన్సీ ప్రాంతమైన దేవీపట్నం మండలం ఉప్పయ్యపాలెం నుంచి నీటిని తెచ్చుకుంటున్నారన్నారు. సత్యసాయి తాగునీటి పథకం సిబ్బందికి జీతాలివ్వక, వారు సమ్మె చేయడంతో సమస్య ఉత్పన్నమైందన్నారు.

అంబేడ్కర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



సాత్విక్



చరణ్ తేజ



రవి తేజస్



కిశోర్

అనపర్తి: రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు అనపర్తి శివారు కొత్తూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంటినరీ జూనియర్ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థులు అర్హత సాధించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ మరపట్ల రాజు తెలిపారు. రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా ఎంపికలలో టెన్నికాయిట్‌లో సాత్విక్, సాఫ్ట్‌బాల్‌లో యు.చరణ్ తేజ, సీహెచ్ రవితేజస్, బేస్ బాల్‌లో కె.కిశోర్ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఆ విద్యార్థులకు, వ్యాయామోపాధ్యాయులను ఆయన అభినందించారు.

వైద్యసేవలను వినియోగించుకోవాలి



ముకుందవరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ వేణు శ్రీలక్ష్మి

రంగంపేట: స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ద్వారా అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి అన్నారు. ముకుందవరం గ్రామ సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా 259 మంది మహిళలకు వివిధ పరీక్షలు జరిపారు. అవసరమైన మహిళలకు సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్, ఓరల్ క్యాన్సర్ స్క్రీనింగ్, బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించి సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వి.తులసీ దాస్, పీహెచ్ఎన్ కె.మేరీ హెలేనా, ఎంపీహెచ్ఎస్ కె.రామ్మోహన్ పాల్గొన్నారు.

● సింగంపల్లిలో డాక్టర్ సంకీర్తన ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరానికి 212 మంది మహిళలు హాజరై, వివిధ రకాల పరీక్షలు చేయించుకున్నారు.

పంచాయతీ పాలకమండలి అభిప్రాయ సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి మద్దార్ బీబీ

సీతానగరం: పురుషోత్తపట్నం పంచాయతీ నుంచి రామచంద్రపురం గ్రామాన్ని వేరు చేయడంపై పంచాయతీ పాలక మండలి సభ్యులతో పంచాయతీ కార్యదర్శి షేక్ మద్దార్ బీబీ శుక్రవారం సమావేశం నిర్వహించి అభిప్రాయ సేకరణ చేశారు. పురుషోత్తపట్నం, రామచంద్రపురం ఒకే పంచాయతీగా ఉంటున్నాయని, దీంతో రామచంద్రపురాన్ని వేరు చేయాలని కలెక్టర్‌కు గతంలో కొందరు అర్జీ అందించారు. దీంతో కలెక్టర్ ఆదేశాలు, డీపీఓ శాంతమణి సూచనల మేరకు పంచాయతీ కార్యదర్శి బీబీ ఈ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, ఎంపీటీసీ ఊసే ఏసమ్మ, సర్పంచ్ సరిపల్లి అనురాధ, 12 మంది వార్డు మెంబర్లు పాల్గొన్నారు. ఎప్పటిలాగే పురుషోత్తపట్నం, రామచంద్రపురం గ్రామాలను ఒకే పంచాయతీగా ఉంచాలని తొమ్మిది మంది వార్డు మెంబర్లు, సర్పంచ్‌లు ఆమోదించగా, విడదీయాలంటూ ముగ్గురు వార్డు మెంబర్లు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. పంచాయతీ పాలక మండల అభిప్రాయ సేరకణను డీపీఓకు అందిస్తామని మద్దార్ బీబీ తెలిపారు.

వైభవంగా అఖండ దీపోత్సవం



కొమరిపాలెంలో అఖండ దీపాలతో భవాని మాలధారులు

బిక్కవోలు: కొమరిపాలెం గ్రామంలోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం భవానీ మాలధారులు అఖండ దీపోత్సవం నిర్వహించారు. గురుభవాని గంగారాజు ఆధ్వర్యంలో సుమారు 250 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తీన్‌మార్ డప్పులు, కోలాటం నడుమ గ్రామోత్సవం జరిపారు. కార్యక్రమంలో మల్లిడి పెద్దిరెడ్డి, మంగయ్యమ్మ దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు జామి విశ్వేశ్వరరావు, ఉప సర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీల ఆదాయాన్ని పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

బిక్కవోలు: గ్రామాల్లో ఉండే వనరుల సహాయంతో పంచాయతీల ఆదాయాన్ని పెంచాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్లు కృష్ణారెడ్డి, శ్రీనివాస్ మాట్లాడుతూ ఎలాంటి ఆదాయం వనరులు గుర్తించాలో తెలియజేశారు. కార్యక్రమంలోని ఎంపీపీ తేతలి సుమ, పరిపాలనా అధికారి నాగేంద్ర ప్రసాద్, ఈవోపీఆర్డీ జాన్ మిల్లన్ పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం

సీతానగరం: ముగ్గళ్ల గ్రామానికి చెందిన 70 ఏళ్ల అమలదాసు మంగ కనిపించడం లేదంటూ ఆమె భర్త ఉప్పయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఉప్పయ్య ఈ నెల 21న బయట భోజనానికి వెళ్లి మధ్యాహ్నం 1.45 గంటలకు ఇంటికి చేరుకున్నాడు. అయితే ఇంటిలో మంగ కనిపించలేదు. దీంతో బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

లారీ మాయం

రాజానగరం: మండలంలోని పాలచర్లలో కాటా వద్ద పార్కు చేసిన లారీ చోరీకి గురైంది. ఈ మేరకు యజమాని మన్యం గణేశ్వరరావు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. గణేశ్వరరావు నాలుగు లారీలతో ట్రాన్స్‌పోర్టు ఆఫీసు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో వ్యక్తిగత పనిపై హైదరాబాద్‌కు వెళుతూ సమీపంలోనే ఉన్న ఏఎస్ఆర్ లారీ కాటా వద్ద ఆ నాలుగు లారీలను పార్కు చేశాడు. గురువారం హైదరాబాద్‌లో పని పూర్తి చేసుకుని శుక్రవారం ఉదయం తిరిగి వచ్చి చూస్తే ఆ నాలుగు లారీలలో ఒకటి (ఏపీ 39 డబ్ల్యూసీ7729) కనిపించలేదు. అతడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎస్.ప్రియకుమార్ తెలిపారు.

నేడు పీడీఎస్‌యూ ఆహ్వాన సంఘ సమావేశం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో శనివారం ఉదయం 10.30 గంటలకు పీడీఎస్‌యూ ఆహ్వాన సంఘ సమావేశం జరగనుంది. ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ఎండీ రఫీ, ఎస్.కిరణ్ కుమార్ శుక్రవారం ప్రకటనలో ఈ విషయం తెలిపారు. పీడీఎస్‌యూ రాష్ట్ర 24వ మహాసభలను నవంబర్‌లో రాజమహేంద్రవరంలో జరుపుకోవాలని సంఘ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించిందన్నారు. వాటి విజయవంతం కోసం ఆహ్వాన సంఘం సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.

లోకరక్షకీ.. పాహిమాం

- భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్ర ఉత్సవాలు
- మహాలక్ష్మీదేవిగా అమ్మవారు

రంగంపేట: దసరా శరన్నవరాత్ర ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. వీటిలో భాగంగా ఐదో రోజు శుక్రవారం రంగంపేటలోని దేవీ సెంటర్, ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవార్లను మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. చంద్రేడులోని కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో, దొంతమూరు మెయిన్ రోడ్డులోని విజయ దుర్గాదేవి, ఈలకొలను ముత్యాలమ్మతల్లి, వడిశలేరు, దొడ్డిగుంట, సింగంపల్లి, కోటపాడు, ముకుందవరం గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

సీతానగరం: సింగవరం పంచాయతీ పరిధి నాగరత్నం కాలనీలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. ముగ్గళ్ల ర్యాంపు సమీపంలోని విజయ కనకదుర్గ అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు.

బిక్కవోలు: బిక్కవోలు గోలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ దేవికి మహాలక్ష్మీదేవిగా అలంకరణ చేశారు. పందలపాక వెలమపేట రామాలయం వద్ద శ్రీదేవి, రాజరాజేశ్వరి, కొమరిపాలెం మహాలక్ష్మికి అలంకరణ చేశారు. అర్చకుడు గరిమెళ్ల సత్య ప్రకాశరావు ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. బలభద్రపురం, కొంకుదురు, తొస్సిపూడి గ్రామాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో గల ప్రముఖ ఆలయాలు, భక్తులు ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. గండ్రేడు, రాజుపాలెం, పైన, వేండ్ర, జి.మామిడాడ, పెదపూడి, పెద్దాడ, సంపర, రామేశ్వరం, దోమాడ, కరకుదురు గ్రామాల్లో విశేష పూజలు చేశారు.

అనపర్తి: పాత ఊరిలోని తురక వీధి సెంటర్‌లో దసరా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించి, పూజలు జరిపారు. మహిళలు పెద్ద ఎత్తున అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు.



అనపర్తి పాత ఊరిలో అమ్మవారు

కోరుకొండ: గాదాలలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు.

రాజానగరం: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో కొలువైన బాలా త్రిపుర సుందరిని శుక్రవారం కరెన్సీ నోట్లతో మహాలక్ష్మిగా అలంకరించారు. సుమారు రూ.15 వేల విలువైన రూ.వంద, రూ.50, రూ.20, రూ.10 నోట్లను ఈ అలంకరణకు ఉపయోగించారు.



మహాలక్ష్మి అలంకరణలో లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలోని బాలా త్రిపుర సుందరి

భక్తిశ్రద్ధలతో అష్టలక్ష్మీ పూజలు

పెదపూడి: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం పెదపూడిలోని శ్యామలాంబ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో అష్టలక్ష్మీ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు కొమ్మఖలపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



పందలపాకలో రాజరాజేశ్వరి



రంగంపేటలో విజయదుర్గ అమ్మవారు



మహాలక్ష్మి అలంకరణలో సంపర విజయదుర్గమ్మ



గాదాల గ్రామంలో రాజరాజేశ్వరి అమ్మవారు



సింగవరం పంచాయతీ నాగరత్నం కాలనీలో కనకదుర్గమ్మ